తెలంగాణ TELANGANA MUCHATLU

# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం - 30 - ఆగస్టు - 2026 | సంపుటి : 4 | సంచిక : 87 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## రైతుల ప్రయోజనాల కోసం విత్తన చట్టం వేగవంతం

- సమగ్ర విత్తన చట్టంపై మంత్రి తుమ్మల సమీక్ష
- రైతుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- కేంద్రం జాప్యంపై అసంతృప్తి వ్యక్తం
- వచ్చే పంటకాలానికే చట్టం అమలు లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకురావడంలో ఇక ఎలాంటి జాప్యం ఉండకూడదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండటంతో పాటు విత్తన ఉత్పత్తి రైతుల హక్కులు, ప్రయోజనాలు కాపాడేలా చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో విత్తన చట్టం2025పై సమీక్ష సమావేశం

మిగతా 2లో..



## సూరారం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు



- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి
- పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమం
- సంక్షేమ పథకాల అమలుపై మంత్రి సమీక్ష
- మౌలిక వసతుల కల్పనకు హామీ

**హనుమకొండ, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో నిర్వహించిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన ద్వారా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తున్నామని తెలిపారు. సూరారం గ్రామంలో 26 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు 475 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందుతున్నాయని చెప్పారు. అలాగే 665 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించామని, 158 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశామని వెల్లడించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, కళ్యాణలక్ష్మి వంటి పథకాల ద్వారా

మిగతా 2లో..

## పాన్‌షాప్ ముసుగులో గంజాయి చాక్లెట్ల దందా



- శామీర్‌పేట్‌లో నిందితుడి అరెస్ట్
- 5,298 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు స్వాధీనం
- యువత, చిన్నారులే ప్రధాన లక్ష్యమని వెల్లడి
- మాదకద్రవ్యాల నియంత్రణపై పోలీసుల అప్రమత్తత

**హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ శామీర్‌పేట్ ప్రాంతంలో పాన్‌షాప్ ముసుగులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన బైద్‌నాథ్ అనే వ్యక్తి ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. మాదకద్రవ్యాల

మిగతా 2లో..






## చిన్న నీటిపారుదల వ్యవస్థపై కీలక నివేదిక

- ముఖ్యమంత్రికి నివేదిక అందజేసిన రైతు కమిషన్
- చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం ప్రతిపాదన
- నీటి వినియోగ సామర్థ్య పెంపుపై దృష్టి
- పంటల మార్పిడి, ఎఫ్‌పీవోల ఏర్పాటుపై సీఎం సూచనలు

**హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే దిశగా తెలంగాణ వ్యవసాయ-రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి శనివారం అందజేశారు. కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, నీటి భద్రత, గ్రామీణ జీవనోపాధుల మెరుగుదలకు చిన్న నీటి పారుదల వ్యవస్థ పునరుద్ధరణ అత్యంత అవసరమని నివేదికలో పేర్కొన్నారు. కమిషన్ ప్రతినిధి బృందంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, భవానిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కమిషన్ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో విస్తృతంగా చర్చించారు. వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాలను ప్రోత్సహించడంతో పాటు

మిగతా 2లో..





## వేపచెట్టు వివాదం.. ఇద్దరి దుర్మరణం

- ఎర్రగడ్డ తండాలో తీవ్ర ఉద్రిక్తత
- గొడ్డళ్లతో పరస్పర దాడులు
- ఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రి మార్గంలో మరొకరు మృతి
- ఎస్ఐపై కూడా దాడి.. తలకు గాయాలు

**సూర్యాపేట, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో శనివారం వేపచెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఇంటి పక్కన ఉన్న వేప చెట్టుకు సంబంధించిన చిన్నపాటి వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసి తీవ్ర విషాదంగా మారింది. ఇరువర్గాల వారు గొడ్డళ్లతో పరస్పరం దాడులకు దిగడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం, వేప చెట్టు యాజమాన్యం మరియు దానిని తొలగించే అంశంపై రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం ఈ వివాదం మళ్లీ చెలరేగి వాగ్వాదంగా ప్రారంభమై, కొద్దిసేపటికే హింసాత్మక ఘర్షణగా మారింది. ఆగ్రహంతో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు గొడ్డళ్లతో దాడి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో వెంకటేశ్వర్లు యాదవ్ తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో వ్యక్తి సైదా కూడా తీవ్ర గాయాలపాలవగా

మిగతా 2లో..



## తెలంగాణ–మారిషస్ సహకారానికి కొత్త ఊపు

- మంత్రి శ్రీధర్ బాబుతో మారిషస్ మంత్రి భేటీ
- ఐటీ, టూరిజం, విద్యా రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ
- నైపుణ్యాభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై ఆసక్తి
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ మంత్రి లుచ్‌మనన్ పెంతియా శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ-మారిషస్ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఉన్న అవకాశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. పరిపాలన, టూరిజం, ఐటీ, ఐటీఈఎస్, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలు, నైపుణ్యాభివృద్ధి, విద్య వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. సమావేశంలో మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియా మాట్లాడుతూ, స్వల్పకాలంలోనే అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధించిన తెలంగాణను తమ దేశం విశ్వసనీయ భాగస్వామిగా భావిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా సాంకేతికత ఆధారిత పరిపాలన, పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్య శిక్షణ రంగాల్లో తెలంగాణ సాధించిన పురోగతి తమకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సన్నిహిత సహకారం పరస్పర ప్రయోజనాలకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

మిగతా 2లో..



## దివ్యాంగుల హామీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన హరీశ్‌రావు

- ప్రభుత్వం హామీలు అమలు చేయలేదని విమర్శ
- పెన్షన్ పెంపుపై ప్రశ్నలు
- కళ్యాణలక్ష్మి పథకంపై ఆరోపణలు
- దివ్యాంగుల సంక్షేమంపై రాజకీయ విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు విమర్శించారు. దివ్యాంగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దివ్యాంగుల సంక్షేమానికి విశేష ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్నారు. ఒకప్పుడు రూ.500గా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.4,016కు పెంచారని గుర్తు చేశారు. అలాగే దివ్యాంగులకు రిజర్వేషన్లు పెంచడంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. దివ్యాంగుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ స్థాయిలో అవార్డు కూడా పొందిందని

మిగతా 2లో..

ఆదివారం - 30 - ఆగస్టు - 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# చిన్న నీటిపారుదల వ్యవస్థపై కీలక నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యానవన పంటల సాగును పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీవోలు) ఏర్పాటుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. చిన్న నీటిపారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానించి నీటి వినియోగాన్ని సమగ్రంగా నిర్వహించే విధానాలను అమలు చేయాలని పేర్కొంది. ఈ చర్యల ద్వారా సాగునీటి వినియోగం మెరుగుపడి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని అభిప్రాయపడింది. రాష్ట్రంలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) సరిహద్దులను తక్షణం గుర్తించి, ఆక్రమణలను తొలగించి వాటిని సంరక్షించాలని సూచించింది. చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని నివేదికలో వివరించింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువులు కీలక పాత్ర పోషిస్తున్నాయని కమిషన్ పేర్కొంది. చెరువుల ఆధారిత వ్యవసాయాన్ని బలోపేతం చేయడం ద్వారా రైతుల ఆదాయం పెరగడమే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా కొంతవరకు తగ్గించవచ్చని అభిప్రాయపడింది. నీటి వనరుల సంరక్షణను దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహంలో భాగంగా చూడాలని సూచించింది. గత రెండేళ్లలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సిఫారసులను ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కమిషన్ అందిస్తున్న సూచనలను సీఎం అభినందించారు. కమిషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, రైతుల ప్రయోజనాల దృష్ట్యా మరిన్ని ఆచరణాత్మక సూచనలు అందించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం, కమిషన్ సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు సమావేశంలో వెల్లడైంది.

# పాన్‌షాప్ ముసుగులో గంజాయి చాక్లెట్ల దందా

(మొదటి పేజీ తరువాయి)

విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు దాడులు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి భారీ మొత్తంలో గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 25 కిలోల బరువున్న 5,298 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. మార్కెట్లో సాధారణ చాక్లెట్ల మాదిరిగా కనిపించేలా వీటిని ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దర్యాప్తులో యువత, చిన్నారులనే ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఈ గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. తక్కువ ధరలకు అందుబాటులో ఉంచి మాదకద్రవ్యాల అలవాటుకు యువతను ఆకర్షించే ప్రయత్నం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ చాక్లెట్ల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. నిందితుడు ఈ గంజాయి చాక్లెట్లను ఎక్కడి నుంచి తెప్పిస్తున్నాడు, మరెవరు ఈ నెట్‌వర్క్‌లో ఉన్నారు అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు కూడా వీటి సరఫరా జరిగిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉండే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాజాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడేందుకు ప్రజల సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని, అపరిచిత ఆహార పదార్థాలు లేదా చాక్లెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# రైతుల ప్రయోజనాల కోసం విత్తన చట్టం వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి, నాణ్యత నియంత్రణ, విక్రయాలు, ధరల నియంత్రణ, విత్తన కంపెనీల బాధ్యతలు, రైతుల హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రైతులకు నష్టాలు కలగకుండా విత్తన రంగాన్ని మరింత క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. విత్తన రంగంలో పారదర్శకత పెంచడంతో పాటు రైతులకు మెరుగైన రక్షణ కల్పించే విధంగా చట్టాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం గతంలోనే సమగ్ర విత్తన చట్టం రూపకల్పన కోసం ప్రత్యేక విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి గుర్తుచేశారు. ఈ కమిటీ రైతులు, విత్తన కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లు, డీలర్లు, పంపిణీదారులు, వ్యవసాయ నిపుణులు, అధికారులు తదితర వర్గాలతో సంప్రదింపులు జరిపి సమగ్ర అధ్యయనం నిర్వహించిందన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకురావడానికి సిద్ధమవుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా విత్తన చట్టం2025 ముసాయిదాను రూపొందించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా బిల్లుపై తెలంగాణ ప్రభుత్వం తన అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను ఇప్పటికే పంపిందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు కీలక సూచనలు కేంద్రానికి అందజేశామని తెలిపారు. అయితే నెలలు గడుస్తున్నా కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.

విత్తన చట్టం విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు లేఖలు రాసినప్పటికీ పురోగతి కనిపించలేదన్నారు. ఇప్పటికే ఒక పంటకాలం గడిచిపోయిందని, రైతుల ప్రయోజనాల కోసం ఇకపై ఆలస్యం చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. వచ్చే పంటకాలానికైనా సమగ్ర విత్తన చట్టాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీ సూచనలు, రైతుల అవసరాలు, విత్తన రంగంలో ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని చట్టాన్ని తుది రూపం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ప్రముఖ విత్తన ఉత్పత్తి రాష్ట్రంగా, "సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా"గా గుర్తింపు పొందిన తెలంగాణలో విత్తన రంగానికి బలమైన చట్టపరమైన వ్యవస్థ అత్యవసరమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# వేపచెట్టు వివాదం.. ఇద్దరి దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఘటన సమాచారం అందుకున్న మేళ్లచెరువు పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. అయితే ఆగ్రహంతో ఉన్న ఒక వర్గం పోలీసుల చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఇరు వర్గాలను చెదరగొట్టే క్రమంలో ఉద్రిక్తత మరింత పెరిగింది.

ఈ సందర్భంగా మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌పై కూడా దాడి జరిగినట్లు తెలిసింది. ఆగ్రహంతో ఉన్న వ్యక్తులు గొడ్డలితో దాడి చేయడంతో ఆయన తలకు గాయాలయ్యాయి. వెంటనే సహచర పోలీసులు ఆయనను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటన అనంతరం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసి ఘర్షణకు దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. గ్రామంలో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఘటన సమాచారం అందుకున్న మేళ్లచెరువు పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. అయితే ఆగ్రహంతో ఉన్న ఒక వర్గం పోలీసుల చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఇరు వర్గాలను చెదరగొట్టే క్రమంలో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈ సందర్భంగా మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌పై కూడా దాడి జరిగినట్లు తెలిసింది. ఆగ్రహంతో ఉన్న వ్యక్తులు గొడ్డలితో దాడి చేయడంతో ఆయన తలకు గాయాలయ్యాయి. వెంటనే సహచర పోలీసులు ఆయనను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటన అనంతరం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసి ఘర్షణకు దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. గ్రామంలో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# గోల్ఫ్ టూరిజంపై తెలంగాణ భారీ ప్రణాళిక

- **జవహర్‌నగర్‌లో 130 ఎకరాల గోల్ఫ్ కోర్స్**
- **సోమశిలలో అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టు**
- **క్రీడలు–పర్యాటక రంగాల సమన్వయానికి ప్రాధాన్యం**
- **తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ప్రభుత్వ మద్దతు**

**హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణను ప్రపంచ స్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శామీర్‌పేట్ సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో గోల్ఫ్ కోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే కృష్ణా నది తీరంలోని సోమశిలలో మరో ప్రపంచ స్థాయి గోల్ఫ్ కోర్స్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులు దేశ విదేశాల నుంచి ప్రొఫెషనల్, ఔత్సాహిక గోల్ఫర్లను ఆకర్షించడమే లక్ష్యంగా రూపొందుతున్నాయని పేర్కొన్నారు. సోమశిలలో ప్రతిపాదిత గోల్ఫ్ కోర్స్ కృష్ణా నది ఒడ్డున, నల్లమల అటవీ ప్రాంతం మధ్య, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ సమీపంలో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వివరించారు. ప్రకృతి సోయగాలు, క్రీడలు, పర్యాటకాన్ని మేళవించే ప్రత్యేక గోల్ఫ్ టూరిజం కేంద్రంగా ఈ ప్రాంతం రూపుదిద్దుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక వసతులతో సోమశిల గోల్ఫ్ టూరిజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నమెంట్‌కు సంబంధించిన విలేకరుల సమావేశంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా తెలంగాణ టూరిజం భాగస్వామ్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు. గోల్ఫ్ క్రీడతో పాటు తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, పర్యాటక ఆకర్షణలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా ఈ టోర్నమెంట్ నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విశేషాలు హైదరాబాద్‌కే పరిమితం కాదని, సరస్సులు, అటవీ ప్రాంతాలు, నదులు, కోటలు, రాజభవనాలు వంటి అనేక పర్యాటక సంపదలు రాష్ట్రంలో ఉన్నాయని జూపల్లి కృష్ణారావు చెప్పారు. టోర్నమెంట్‌కు నేపథ్యంగా నిలిచే గోల్కొండ కోట తెలంగాణ చారిత్రక వైభవానికి ప్రతీక అని వివరించారు. అంతర్జాతీయ గోల్ఫర్లు పాల్గొనడం ద్వారా తెలంగాణ పర్యాటక, క్రీడా సామర్థ్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించే అవకాశం లభిస్తుందని అన్నారు.

భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ సేవలను రాష్ట్రంలో పర్యాటక, క్రీడా రంగాల ప్రోత్సాహానికి వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కపిల్ దేవ్ అనుభవం, ఖ్యాతి తెలంగాణ పర్యాటక ఆకర్షణలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా ప్రచారం చేయడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కపిల్ దేవ్




మాట్లాడుతూ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారాన్ని అభినందించారు. ఈ టోర్నమెంట్ తెలంగాణ, హైదరాబాద్‌లను గోల్ఫ్ టూరిజం గమ్యస్థానాలుగా మరింతగా ప్రోత్సహిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1 నుంచి 4 వరకు జరిగే తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నమెంట్‌లో 132 మంది గోల్ఫర్లు పాల్గొని రూ.1 కోటి ప్రైజ్ మనీ కోసం పోటీపడనున్నారు. భారతీయ ప్రొఫెషనల్ గోల్ఫర్లతో పాటు విదేశీ క్రీడాకారులు కూడా పాల్గొంటున్నారు. ఈ టోర్నమెంట్‌కు అధికారిక ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్ పాయింట్లు లభించనున్నాయి. డీపీ వరల్డ్ ఇండియా ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించే క్రీడాకారుల ఎంపికలో ఈ పోటీ కీలకంగా మారనుంది. కార్యక్రమంలో డీపీ వరల్డ్ పీజీటీఐ సీఈవో అమన్‌దీప్ జోహల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ప్రతినిధులు, స్పాన్సర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సూరారం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని వివరించారు.

గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు హుజురాబాద్-హనుమకొండ మధ్య సూరారం మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసు నడిపే అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. అలాగే సూరారం-పొలాడ్‌పల్లి మధ్య వంతెన నిర్మాణం, గ్రామ రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి మౌలిక సదుపాయాల పనులను ప్రాధాన్యంగా చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. సూరారం గ్రామంలో ఇప్పటికే సుమారు రూ.60 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. మిగిలిన పనులను కూడా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని, స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని తెలిపారు.

వ్యవసాయ రంగంపై మాట్లాడుతూ రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామ ప్రజలకు 1,200 స్టీల్ బ్యాంక్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేలా గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇందుకు ఎలాంటి పైరవీలు అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజా సంక్షేమమే తన ప్రాధాన్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ..హామీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

హరీశ్‌రావు పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం విషయంలో గత ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధిని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడంలో విఫలమైందని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు. ఎన్నికల సమయంలో దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలు కాలేదని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది దివ్యాంగులకు ప్రభుత్వం బకాయి పడిందని పేర్కొంటూ, పెన్షన్ పెంపుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సంక్షేమాన్ని రాజకీయ హామీలకే పరిమితం చేయకూడదన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తన రాజకీయ గురువుగా పేర్కొంటారని, ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ అందిస్తున్నప్పుడు తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కళ్యాణలక్ష్మి పథకం విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చలేదని హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగులకు కళ్యాణలక్ష్మి సాయాన్ని రూ.2 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ప్రకటించి అమలు చేయకుండా తప్పించుకుందని విమర్శించారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# తెలంగాణ–మారిషస్ సహకారానికి కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)

మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాభివృద్ధి కోసం ఆధునిక పరిపాలనా విధానాలపై శిక్షణ అందించడంలో తెలంగాణ సహకారం కోరారు. రాష్ట్రంలోని ఎంసీహెచ్ఆర్డీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర ప్రముఖ విద్యా, శిక్షణా సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరచుకోవాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు. ప్రజా పరిపాలనలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో తెలంగాణ అనుభవాన్ని పంచుకోవాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, అన్ని రంగాల్లోనూ మారిషస్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇరు ప్రాంతాల మధ్య విద్య, పరిశ్రమలు, టూరిజం, సమాచార సాంకేతిక రంగాల్లో మరింత బలమైన సంబంధాలు ఏర్పడే అవకాశాలపై కూడా చర్చించారు. పరస్పర సహకారంతో కొత్త అవకాశాలను అన్వేషించి, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి నమూనాలు, డిజిటల్ పరిపాలన విధానాలపై మారిషస్ ప్రతినిధి బృందం ప్రత్యేక ఆసక్తి కనబరిచినట్లు అధికారులు తెలిపారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026"లో పాల్గొనాలని మంత్రి శ్రీధర్ బాబు, మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియాను ఆహ్వానించారు. ఈ సమావేశంలో సెక్రటరీ ఫర్ పబ్లిక్ సర్వీస్ దేవేంద్ర గోపాల్, ఏఐపీఎస్ఐ బోర్డ్ చైర్‌పర్సన్ డాక్టర్ నికోలస్ రాగోడూ, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ దుర్బరీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ ఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలోకి దూసుకెళ్లిన బైక్.. వ్యక్తికి తీవ్ర గాయాలు..

- సకాలంలో స్పందించిన 108 సిబ్బంది.
- అంబులెన్స్‌లోనే అత్యవసర వైద్యం.



**సత్తుపల్లి, ఆగస్టు 29(తెలంగాణ ముచ్చట్లు):** పొలం పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంతో సహా సిమెంట్ డ్రైనేజీలో పడిపోయి తీవ్రంగా గాయపడిన ఘటన సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ నూర్ అహ్మద్ (30) పొలం పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ఇంటి ముందు ఉన్న సిమెంట్ డ్రైనేజీలోకి వాహనం అదుపుతప్పి దూసుకెళ్లింది. దీంతో నూర్ అహ్మద్ డ్రైనేజీలో పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. తలకు తీవ్ర గాయం కావడంతో చర్మం మొత్తం దెబ్బతిని రక్తస్రావం జరిగినట్లు తెలిసింది. ప్రమాద సమాచారం అందుకున్న సత్తుపల్లి 108 సిబ్బంది (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) గొల్లమందల కృష్ణ, పైలెట్ పాలడుగు వేణు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని గమనించిన సిబ్బంది అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం బాధితుడిని అంబులెన్స్‌లోకి ఎక్కించి, మార్గమధ్యంలోనూ అత్యవసర వైద్య సేవలు అందిస్తూ సత్తుపల్లి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి బాధితుడికి అత్యవసర వైద్యం అందించిన 108 సిబ్బందిని గంగారం గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా 108 ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్, జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్ సిబ్బందిని అభినందించారు.

# క్రీడా ప్రతిభకు వేదిక.. సెప్టెంబర్ 9న ఎంపికలు



**ఎల్కతుర్తి, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎంఈఓ చదువుల సత్యనారాయణ ఆదేశాల మేరకు మండల ఎస్‌జీఎఫ్ సమావేశం కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో నిర్వహించారు. మండల సెక్రటరీ ఎం. ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించే అండర్14, అండర్17 బాలబాలికల కబడ్డీ, కోకో క్రీడలకు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 2026 సెప్టెంబర్ 9న మండల స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం. ధనలక్ష్మి మాట్లాడుతూ క్రీడాకారులు సెప్టెంబర్ 9న ఉదయం 9 గంటలలోపు కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ నంబర్, పెన్ నెంబర్ వెంట తీసుకురావాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు బి. సుధాకర్, జి. శ్రీకాంత్, ఆర్. ఉదయ్, కె. తిరుపతి, సిహెచ్. పూర్ణిమ, టి. రాములు, జి. ప్రేమ ప్రసాద్‌రావు, ఎం. ఉషారాణి, ప్రభావతి, బి. స్వరూప, బి. కిరణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పామిరెడ్డిపల్లిలో వికసిత్ ప్రణాళికకు శ్రీకారం



**పెద్దమందడి,ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో భాగంగా తొలి గ్రామసభను సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతులు, రైతులకు ఉపయోగపడే అభివృద్ధి పనులపై చర్చించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా బోరుబావుల పునరుద్ధరణ గుంతలు, నీటి నిల్వ కుంటలు, పొలాల్లో నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఇంటింటా ఇంకుడు గుంతలు, పండ్ల తోటలు, పశువుల కొట్టాలు, గొర్రెల కొట్టాలు, నాటుకోళ్ల పెంపకం వంటి పనులకు అవకాశం ఉన్నట్లు రైతులకు వివరించారు. ఈ పనుల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి గ్రామపంచాయతీ ఆమోదంతో చేపట్టాలని సూచించారు. వచ్చే నెల 8వ తేదీ వరకు రెండో గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటిలోగా గ్రామ ప్రజలు, రైతులు తమకు అవసరమైన పనులకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కార్యక్రమ అధికారి సురేష్, సాంకేతిక సహాయకుడు సురేష్, ఉపసర్పంచ్ రాములమ్మ, వార్డు సభ్యులు నరేష్, పద్మ, మాజీ ఎంపీటీసీ ఇందిరా లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కన్న, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, క్షేత్ర సహాయకుడు ఆనంద్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్ ప్రోగ్రాం







- నూతన విద్యార్థులకు ఘన స్వాగతం.
- విజయ శిఖరాలు అధిరోహించాలని అతిథుల ఆకాంక్ష.

**సత్తుపల్లి, ఆగస్టు 29(తెలంగాణ ముచ్చట్లు):** మండల పరిధిలోని బి గంగారం గ్రామం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసెట్ 2026 కౌన్సెలింగ్, మేనేజ్‌మెంట్ కోటా ద్వారా ఇంజనీరింగ్, ఎంబీఏలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు శనివారం మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో ఓరియంటేషన్ ప్రోగ్రాంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, గంగారం సర్పంచ్ కాకర్ల రేవతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి అన్విద మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. “జ్ఞానంతో మిమ్మల్ని మీరు ఆయుధంగా చేసుకోండి. అదే భవిష్యత్తులో మీకు గొప్ప బలంగా మారుతుంది” అని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, విద్యా వనరులు అందించేందుకు యాజమాన్యం కృషి చేస్తుందని తెలిపారు. సైద్ధాంతిక, ఆచరణాత్మక అంశాలపై సమర్థవంతమైన బోధన అందిస్తూ విద్యార్థులను విజయవంతమైన భవిష్యత్తుకు సిద్ధం చేస్తామని చెప్పారు.



కళాశాల చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, హెటెరో ఫార్మాస్యూటికల్స్ అధినేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి పంపిన సందేశాన్ని వర్చువల్‌గా వినిపించారు. సాయిస్ఫూర్తిలో చదివిన అనేక మంది విద్యార్థులు దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుత విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సాయిస్ఫూర్తి క్యాంపస్ ప్రతి విద్యార్థికి అపరిమిత అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. హెటెరో స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా అర్హత పొందిన విద్యార్థులకు ఫీజు మినహాయింపు కల్పిస్తున్నట్లు తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ విద్య అంటే కేవలం మంచి మార్కులు సాధించడం, డిగ్రీ పొందడం మాత్రమే కాదని, జ్ఞానం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, విలువలు, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యాన్ని పెంపొందించుకోవడమని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను వెలికితీసుకోవడంతో పాటు అనుభవాల నుంచి నేర్చుకుని భవిష్యత్తుకు సిద్ధం కావాలని సూచించారు. అలాగే అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించాలని, వైఫల్యాలకు భయపడకుండా ముందుకు సాగాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సానుకూల అభ్యాస వాతావరణం కల్పిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందాన్ని అభినందించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే నాటికి తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో తమ కళాశాల 90 శాతం సీట్ల భర్తీతో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. నాణ్యమైన విద్యపై నమ్మకంతో కళాశాలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.కె. మీరాసాహెబ్ మాట్లాడుతూ ‘విద్యార్థి’ అంటే అభ్యాసకుడని, కళాశాల అందిస్తున్న విద్యా వసతులు, వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, హెటెరో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ కొండా రవికుమార్, డీఏవీ స్కూల్ ప్రిన్సిపాల్ టి. శేషా సాయి శ్రీ, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పాముల శేఖర్ బాబు తదితరులు యూనివర్సిటీ టైమ్‌టేబుల్, సిలబస్, అకడమిక్ విధానం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అన్ని ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, చిన్న స్కిట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నూతన విద్యార్థులకు అతిథులు, కళాశాల యాజమాన్యం అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.





# టీసీల కోసం విద్యార్థుల ధర్నా

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న విస్డం కళాశాల యాజమాన్యం

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):** పట్టణంలోని విస్డం కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు టీసీలు (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు) ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం తిప్పించుకుంటోందని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నిరసన తెలిపారు.విస్డం కళాశాలను ఇతర ప్రాంతాలకు విక్రయించిన నేపథ్యంలో ద్వితీయ సంవత్సరం చదవాల్సిన విద్యార్థులకు టీసీలు అందించాలని పలుమార్లు కోరుతున్నప్పటికీ యాజమాన్యం సరైన సమాధానం ఇవ్వకుండా విద్యార్థులను పదేపదే కళాశాల చుట్టూ తిప్పించుకుంటోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి చదువులు, భవిష్యత్తుపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించి ఎలాంటి జాప్యం లేకుండా టీసీలు అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. దీంతో ఆదివారం ఉదయం 10 గంటల తర్వాత టీసీలు అందజేస్తామని కళాశాల యాజమాన్యం లెటర్‌ప్యాడ్‌పై రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. దీంతో విద్యార్థులు ధర్నాను విరమించారు. అయితే హామీ మేరకు రేపు సంబంధిత ధ్రువపత్రాలు అందించకపోతే విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గట్టు సాయిరాం, జవ్వాజి అనిల్, నలఘుశ హరీష్ యాదవ్, నరెంగుల శివ, సాయి, రాజు, కౌశిక్, వినయ్‌తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన మిత్రబృందం

**వేలేరు, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన గజవెల్లి నాగరాజు తండ్రి గజవెల్లి కుమారస్వామి ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని తోటి స్నేహితులు పరామర్శించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

కుటుంబానికి కొంతైనా అండగా నిలవాలనే ఉద్దేశంతో స్నేహితులు కలిసి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.

స్నేహం అనేది సంతోషాలను పంచుకోవడమే కాకుండా, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలవడంలోనే నిజమైన విలువ ఉందని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మరిజె రామకృష్ణ, నక్క సంపత్, ఏలూరి కరుణాకర్, దామెర రాజేష్, లోనే శివాజీ, కొయ్యడ వంశీ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్రామాల బాట పట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్

- ఐదు గ్రామాల్లో 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమం

ఎల్కతుర్తి, ఆగస్టు 29 ( తెలంగాణ ముచ్చట్లు):






ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గ్రామాల బాట పట్టారు. ఎల్కతుర్తి మండలంలోని సూరారం, దండేపల్లి, వీర నారాయణపురం, వల్లభాపూర్, ఇంద్రనగర్ గ్రామాల్లో 'పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆయా గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ భవనాలు, అంతర్గత సీసీ రోడ్లు, ప్రధాన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సమస్యలపై వినతులు సమర్పించారు.

ప్రజల నుంచి వినతులను స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా పాలనను ప్రజల వద్దకే తీసుకెళ్లాలనే ఉద్దేశంతో 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో ఐదు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మాలల హక్కుల కోసం.. ఆగస్టు 31న ఛలో సెక్రటేరియట్

- రోస్టర్ విధానాన్ని సవరించి మాలలకు న్యాయం చేయాలి

కరీంనగర్, ఆగస్టు 29(తెలంగాణ ముచ్చట్లు ):



మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని జాతీయ మాల మహానాడు డిమాండ్ చేసింది. మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ ఆగస్టు 31న నిర్వహించనున్న మాలల ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జై తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లాల కనకరాజు పిలుపునిచ్చారు.

జాతీయ మాల మహానాడు కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కాడే శంకర్, కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి బోలుమల్ల సదానందం ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఛలో సెక్రటేరియట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ మాలలకు విద్య, ఉద్యోగ రంగాల్లో సముచిత న్యాయం దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 99లో మాలలకు రోస్టర్ పాయింట్ల కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 20 పాయింట్లలోపు రెండు పాయింట్లు మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రోస్టర్ విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారా మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు నష్టపోకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ అమలు విధానం స్పష్టంగా ఉండాలని, అర్హులైన మాల విద్యార్థులు, నిరుద్యోగులకు అవకాశాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నాయకులు అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న ఛలో సెక్రటేరియట్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

ఆగస్టు 31న నిర్వహించే కార్యక్రమానికి మాల విద్యార్థులు, ఉద్యోగులు, యువత, మేధావులు, మహిళలు, వివిధ మాల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసి తమ హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, మాల మహానాడు సీనియర్ నాయకుడు దామెర సత్యం, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇరుకుల యాదగిరి, మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లింగం కుమార్, దానిక ప్రవీణ్, మహిళా రాష్ట్ర సీనియర్ నాయకురాలు తిట్ల ఈశ్వరి, శీలం పుష్పలత, దండి శారద, జక్కుల లలిత తదితరులు పాల్గొన్నారు.





# మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

- ఇన్స్పెక్టర్ భానుప్రకాష్

ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29(తెలంగాణ ముచ్చట్లు )

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి - ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి అని ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ విద్యార్థులకు సూచించారు.

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే తీవ్ర ప్రభావాలు, భవిష్యత్ జీవితంపై కలిగే దుష్పరిణామాలపై పలు పాఠశాలల విద్యార్థులకు,సిబ్బందికి అవగాహన కల్పించే ఉద్దేశంతో పాండురంగపురం, బల్లెపాలి గ్రామంలోని పలు పాఠశాలలో ఖానాపురం హవెలి పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సురక్షితమైన, మాదక ద్రవ్యాల రహిత వాతావరణాన్ని కల్పించడంతో పాటు, మాదక ద్రవ్యాలపై స్థానిక సమాజంలో అప్రమత్తతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల ఎదురయ్యే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక సమస్యలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని అన్నారు.

కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తో పాఠశాల పరిసర ప్రాంతాలలో, ప్రాంగణానికి సమీపంలోని దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, చట్టవిరుద్ధమైన మాదక ద్రవ్యాల ఆనవాళ్లను గుర్తించేలా తనిఖీలు చేపట్టారు.



# పెద్దమందడి జిపిఓ కాశన్న అకాల మృతి

- కుటుంబానికి తహసీల్దార్ మల్లికార్జున్, సిబ్బంది ప్రగాఢ సానుభూతి

పెద్దమందడి, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా పెద్దమందడి మండల రెవెన్యూ శాఖలో సుమారు ఆరు నెలల క్రితం జాయిన్ అయిన కాశన్న, జిపిఓగా బాధ్యతలు స్వీకరించి నెల రోజుల పాటు విధులు నిర్వహించారు. అనంతరం అనారోగ్య కారణాలతో సెలవులో ఉంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం చికిత్స పొందుతూ అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల స్థానికులు, సహచర ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కాశన్న మృతి విషయం తెలుసుకున్న పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున్, వనపర్తి ఆర్డిఓ, రెవెన్యూ సిబ్బంది ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కాశన్న మృతి పట్ల పలువురు అధికారులు, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం ఉధృతం

- -వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే లక్ష్మణ్

ఎల్కతుర్తి, ఆగస్టు 29 ( తెలంగాణ ముచ్చట్లు):



ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే లక్ష్మణ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా కర్రే లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏటా కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేసిందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతోందన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై దేశవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు, ప్రజా సమస్యలపై పోరాటాన్ని బలోపేతం చేసేందుకు ఢిల్లీలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలో దేశ రాజకీయ పరిస్థితులపై సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాతో పాటు పలువురు జాతీయ నాయకులు ప్రసంగించనున్నట్లు వెల్లడించారు.

వ్యవసాయ కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో ఢిల్లీకి తరలివచ్చి బహిరంగ సభలో పాల్గొని 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కర్రే లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.

# ప్రధాన రహదారిపై సూచిక బోర్డుకు దుస్థితి

- చెట్ల మధ్య కనిపించని బోర్డుతో ప్రయాణికులకు ఇబ్బందులు

హుజురాబాద్, ఆగష్టు 29
(తెలంగాణ ముచ్చట్లు ):



హుజురాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిలోని సిరిసపల్లి రోడ్ వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు పక్కకు ఒరిగిపోయి, దాని చుట్టూ చెట్లు పెరగడంతో ప్రయాణికులకు కనిపించకుండా పోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు మార్గాలు గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కొత్తగా వచ్చే వారికి బోర్డు కనిపించక గందరగోళానికి గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సూచిక బోర్డును సరిచేసి, చుట్టుపక్కల పెరిగిన చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# జర్నలిస్టు నేత అనిల్ రెడ్డిని పరామర్శించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు

- దివంగత సరళా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు

ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29
(తెలంగాణ ముచ్చట్లు )

భార్య మృతి పట్ల తీవ్ర విషాదంలో ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం టీవీ9 రిపోర్టర్ కర్ర అనిల్ రెడ్డిని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్యతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పరామర్శించారు.

భద్రాచలంలోని అనిల్ రెడ్డి నివాసానికి శనివారం వెళ్లిన నాయకులు ఆయనను ఓదార్చి, దివంగత సరళా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సరళా రెడ్డి మృతి పట్ల మామిడి సోమయ్య తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, అనిల్ రెడ్డికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు చిర్రా శ్రీనివాస్ గౌడ్, ఎలుగోటి వెంకట్రావు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేముల కొండ రమేష్, ఉపాధ్యక్షుడు కందబోయిన నాగకృష్ణ, జి. గోపాలకృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సుంక మహేష్, మణుగూరు నాయకులు పొదిల సుబ్బారావు, భద్రాచలం నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు సరళా రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనిల్ రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో అండగా ఉంటామని తెలిపారు.



తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# బీజేపీ నిరసన ఉద్రిక్తం

- **ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం.. ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**

**కరీంనగర్, ఆగస్టు 29(తెలంగాణ ముచ్చట్లు ):**

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'ఫీజు బకాయి బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా శనివారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దిష్టిబొమ్మ దగ్ధానికి యత్నించిన పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.
అనంతరం పోలీసుల మోహరింపు మధ్యే బీజేపీ నాయకులు ఎట్టకేలకు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దీంతో తెలంగాణ చౌక్ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు



# డంపింగ్ యార్డ్ తరలింపునకు తెలంగాణ రక్షణ సేన ధర్నా



- **నగరానికి దూరంగా డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి**
- **చెత్తను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలి**

**కరీంనగర్, ఆగస్టు 29(తెలంగాణ ముచ్చట్లు ):**

నగరంలోని డంపింగ్ యార్డ్‌ను నగరానికి దూరంగా వెంటనే తరలించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌లో భారీగా చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, పొగ, దోమలు, కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్‌ను నగరానికి దూరంగా తరలించాలని కోరారు. పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

# సంచార జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 29(తెలంగాణ ముచ్చట్లు )**



ఆగస్టు 31 సంచార జాతుల దినోత్సవం సందర్భంగా సంచార జాతుల హక్కులు, సమస్యలు మరియు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సంచార జాతుల హక్కుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు వల్లెపు సోమరాజు డిమాండ్ చేశారు సంచార జాతులు తరతరాలుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ కార్యక్రమాల్లో సంచార జాతులకు తగిన ప్రాధాన్యత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన ప్రధాన డిమాండ్లు సంచార జాతుల కుటుంబాల సమగ్ర సర్వే నిర్వహించాలి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలి పిల్లలకు విద్య, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ వసతి కల్పించాలి యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి సంచార జాతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి సంచార జాతుల సంస్కృతి, సంప్రదాయాలు మరియు జీవన విధానాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బత్తుల గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు గోగుల ఆది దేవండ్ల వెంకన్న నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ సంచార జాతుల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు ఆగస్టు 31 సంచార జాతుల దినోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా, సంచార జాతుల సమస్యల పరిష్కారానికి కొత్త కార్యాచరణకు నాంది పలికే రోజుగా నిర్వహించాలని వారు కోరారు



# టిఎంజెఫ్ మూడవ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- **-వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూరుగుల నాగేందర్**

**సూర్యాపేట,ఆగస్టు29(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12 హైదరాబాద్ బిసిసిఈ భవన్ లోనిర్వహించనున్న మూడవ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూరుగుల నాగేందర్ పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు వృత్తిపరమైన హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఫోరం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని మాదిగ జర్నలిస్టులందరూ ఐక్యంగా ముందుకు సాగుతూ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వల్దాస్ ప్రవీణ్,రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి మామిడి శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షులు పల్లెటి నాగార్జున, కోశాధికారి కనుకు రవి, జిల్లా నాయకులు మామిడి శంకర్, దుర్గం బాలు, జాన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా దినోత్సవ సైక్లింగ్ ర్యాలీలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

- **సైక్లింగ్‌తో ఆరోగ్యం.. క్రీడలతో మానసిక వికాసం**

**కరీంనగర్, ఆగస్టు 29(తెలంగాణ ముచ్చట్లు ):**



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లో నిర్వహించిన సైక్లింగ్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ "అల్ఫోర్స్" డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.
కోర్టు చౌరస్తా నుంచి ఎల్ఎండీ వరకు నిర్వహించిన సైక్లింగ్ ర్యాలీలో పాల్గొన్న ఆయన ప్రజలకు, ముఖ్యంగా వ్యాయామ ఉపాధ్యాయులకు జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సైక్లింగ్ ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు వ్యక్తుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడటంతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని విజయాల వైపు పయనించాలని సూచించారు.
ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించడం, ఆయన దేశానికి అందించిన సేవలు, క్రీడల పట్ల చూపిన అంకితభావానికి ప్రతీక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

- **తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షా ల హెచ్చరిక**
- **ఉత్తరాంధ్ర, రాయలసీమలో భారీ వర్షా ల అవకాశం**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**




బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వ్యవస్థ ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.
ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. ఈ ప్రభావం సెప్టెంబర్ 2 వరకు కొనసాగవచ్చని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు.
తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు అక్కడక్కడా జల్లులు పడే అవకాశముందని పేర్కొంది. గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో ఇప్పటికే చెరువులు, కుంటలు నిండిన నేపథ్యంలో తాజా వర్షాలు మరింత ప్రభావం చూపే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ రంగంపై కూడా ఈ వర్షాల ప్రభావం ఉండనుంది. ఖరీఫ్ పంటల సాగు జరుగుతున్న సమయంలో వర్షాలు ఉపయోగకరంగా మారే అవకాశమున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైతే పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.
వర్షాలు, ఈదురుగాలులు, పిడుగులు సంభవించే అవకాశమున్నందున ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో సంచరించవద్దని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద ఆశ్రయం పొందకుండా ఉండాలని హెచ్చరించింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించింది. వాహనదారులు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షం పడే సమయంలో రహదారులపై జారుడు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున వేగాన్ని నియంత్రిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. వాతావరణ పరిస్థితులపై అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

# హిమనీనద విస్ఫోటనంతో నేపాల్‌కు ముప్పు

- **కృత్రిమ సరస్సుపై చైనా హెచ్చరికలు**
- **గట్టు తెగితే భారీ వరదల ప్రమాదం**
- **అంచనాలతో కొంత ఊరట**

**కాఠ్మాండు, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):**



నేపాల్‌టిబెట్ సరిహద్దులో హిమనీనదం కూలిపోవడంతో ఏర్పడిన కృత్రిమ సరస్సు (బ్యారియర్ లేక్) పరిస్థితిపై చైనా మరోసారి నేపాల్‌ను అప్రమత్తం చేసింది. సరస్సును అడ్డుకుంటున్న సహజ ఆనకట్ట ఏ క్షణంలోనైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూనే, తాజా అంచనాల ప్రకారం తక్షణ వరద ముప్పు కొంత తగ్గినట్లు వెల్లడించింది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తత కొనసాగుతున్నప్పటికీ పరిస్థితి గతంతో పోలిస్తే కొంత స్థిరంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఎత్తైన పర్వత ప్రాంతంలో హిమనీనదం విస్ఫోటనం చెందడంతో భారీగా మంచు, రాళ్లు, బురద దిగువకు దూసుకువచ్చాయి. ఈ ప్రవాహం నదీ మార్గాన్ని మూసివేయడంతో సహజసిద్ధంగా ఒక భారీ ఆనకట్ట ఏర్పడి దాని వెనుక నీరు నిల్వ కావడం ప్రారంభమైంది. ఈ పరిణామంతో గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్‌తో పాటు భోటే కోశి, త్రిశూలి నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ చేయాల్సి వచ్చింది. నదీ ప్రవాహంలో అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పు స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది.
పరిస్థితి తీవ్రతను వివరిస్తూ చైనా అధికారులు నేపాల్ విదేశాంగ శాఖకు ప్రత్యేక సమాచారం పంపించారు. సరస్సులోని నీటి రంగు క్రమంగా ముదురు రంగులోకి మారుతోందని, ఇది సహజ ఆనకట్టపై ఒత్తిడి పెరుగుతున్న సంకేతంగా భావిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నాటికి సరస్సులో సుమారు 2.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు నిల్వైందని అంచనా వేశారు. ఒకవేళ ఆనకట్ట పాక్షికంగా బద్దలైతే సెకనుకు 500 క్యూబిక్ మీటర్ల వేగంతో నీటి ప్రవాహం సంభవించే అవకాశం ఉందని, అయితే అది ప్రధానంగా నది గట్ల పరిధిలోనే కొనసాగవచ్చని వివరించారు. అయితే తర్వాత నిర్వహించిన పరిశీలనల్లో సరస్సు ఉపరితల వైశాల్యం కొంత మేర తగ్గినట్లు గుర్తించారు. దీనివల్ల తక్షణ వరద ప్రమాదం తగ్గిందని చైనా అధికారులు తాజా నివేదికలో పేర్కొన్నారు. ఈ పరిణామంతో భద్రతా కారణాల వల్ల తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని సహాయక చర్యలను తిరిగి ప్రారంభించారు. అయినప్పటికీ పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరలేదని, నిరంతర పర్యవేక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.
ప్రస్తుతం డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలు, భూసర్వే పరికరాల సహాయంతో సరస్సు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారు. అంతేకాకుండా ఈ సరస్సుకు ఎగువన మరో పెద్ద నీటి నిల్వ ప్రాంతాన్ని కూడా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. అక్కడి నీటి కదలికలు, మంచు పొరల స్థితి, భూభాగ మార్పులను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే చర్యలు తీసుకునేందుకు సరిహద్దు ప్రాంతాల్లో యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచారు. ఇదిలా ఉండగా ఈ ప్రకృతి విపత్తు నేపాల్, టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వరదలు, భూస్థలనాల కారణంగా ఇరువైపులా వందలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వెయ్యి మందికి పైగా గల్లంతైనట్లు అంచనా వేస్తున్నారు. మృతుల్లో విదేశీ పర్యాటకులు, కార్మికులు కూడా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, మరోసారి వరదలు సంభవించే అవకాశాల మధ్య సహాయక బృందాలు శోధన, సహాయక కార్యక్రమాలను కొనసాగిస్తూ బాధితులకు సహాయం అందిస్తున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పోలీస్ కస్టడీలో దళిత యువకుడి మృతి

- ఉత్తరప్రదేశ్‌లో ఘటన కలకలం
- పోలీస్ స్టేషన్ వద్ద కుప్పకూలిన యువకుడు
- పోలీసులపై కుటుంబ సభ్యుల ఆరోపణలు
- కార్డియోజెనిక్ షాక్‌తో మృతిచెందినట్లు పోస్టుమార్టం నివేదిక

బదాయూన్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):




ఉత్తరప్రదేశ్‌లోని బదాయూన్ జిల్లాలో 28 ఏళ్ల దళిత యువకుడు రాజేశ్ పోలీస్ కస్టడీలో మృతిచెందిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భండారా కార్యక్రమంలో జరిగిన గొడవకు సంబంధించి పోలీసులు రాజేశ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలోనే అతడు ఒక్కసారిగా కుప్పకూలడంతో విషాదం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీడియోలో రాజేశ్ ఒక్కసారిగా నేలపై పడిపోవడం, వెంటనే ఇద్దరు పోలీసులు అతడిని లేపేందుకు, ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించడం కనిపించింది. పరిస్థితి విషమించడంతో అతడిని వెంటనే సమీప ఆస్పత్రికి తరలించారు.

అయితే ఆస్పత్రికి చేరుకునేలోపే రాజేశ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. యువకుడి మృతిపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని వారు డిమాండ్ చేశారు. రాజేశ్‌ను పోలీసులు కస్టడీలో కొట్టారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసుల దాడుల కారణంగానే అతడు ప్రాణాలు కోల్పోయాడని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై నిష్పక్షపాత విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మరోవైపు పోలీసులు ఈ ఆరోపణలను ఖండించారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం రాజేశ్ కార్డియోజెనిక్ షాక్ కారణంగా మృతిచెందినట్లు వెల్లడైందని తెలిపారు. అతడి శరీరంపై ఎలాంటి బాహ్య గాయాలు లేదా దాడి ఆనవాళ్లు లేవని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానిక పరిపాలన, పోలీసు శాఖ దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. సీసీటీవీ దృశ్యాలు, వైద్య నివేదికలు, ఇతర ఆధారాలను పరిశీలించి పూర్తి వాస్తవాలను వెలికితీసే ప్రయత్నం జరుగుతోందని అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.




# భారత్–అర్జెంటీనా వాణిజ్య బంధాలకు ఊతం

- సంయుక్త వాణిజ్య కమిటీ నాలుగో సమావేశం
- - లిథియం, ఇంధన రంగాల్లో సహకార విస్తరణ
- - ఫార్మా, డిజిటల్ రంగాలకు కొత్త అవకాశాలు
- - వాణిజ్య పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి

బ్యూనస్ ఐరెస్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):

భారత్-అర్జెంటీనా మధ్య వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ నేతృత్వంలో జరిగిన నాలుగో భారత్-అర్జెంటీనా సంయుక్త వాణిజ్య కమిటీ (జేటీసీ) సమావేశంలో ఇరు దేశాలు పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు అంగీకరించాయి. వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించాయి. సమావేశంలో లిథియం, ఇంధన రంగాలు ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. విద్యుత్ వాహనాలు, బ్యాటరీ తయారీకి అత్యంత కీలకమైన లిథియం నిల్వల విషయంలో అర్జెంటీనాతో సహకారాన్ని పెంచుకోవాలని భారత్ ఆసక్తి వ్యక్తం చేసింది. అదే సమయంలో ఇంధన భద్రత, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహంపై కూడా ఇరు దేశాల ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. వ్యవసాయ రంగంలో కూడా కీలక పురోగతి నమోదైంది. శానిటరీ అండ్ ఫైటోసానిటరీ (ఎస్‌పీఎస్) చర్చల ద్వారా భారత వ్యవసాయ ఉత్పత్తులకు అర్జెంటీనా మార్కెట్‌లో మరింత ప్రాప్యత కల్పించే అవకాశాలపై చర్చించారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఉన్న అడ్డంకులను తొలగించడం, నాణ్యత ప్రమాణాల సమన్వయం వంటి అంశాలపై సానుకూల అవగాహన ఏర్పడినట్లు అధికారులు వెల్లడించారు.

ఫార్మాస్యూటికల్ రంగంలో భారత ఔషధాలకు అర్జెంటీనాలో మార్కెట్ ప్రాప్యతను మెరుగుపరచడం, నియంత్రణ ప్రక్రియలను సరళీకృతం చేయడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. అదనంగా డిజిటల్ టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధన, కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న ఇతర సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు ఆసక్తి వ్యక్తం చేశాయి.

ఈ సందర్భంగా అర్జెంటీనాను సందర్శించిన భారత వ్యాపార ప్రతినిధి బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటివరకు అర్జెంటీనాను సందర్శించిన అతిపెద్ద భారత వ్యాపార ప్రతినిధి బృందంగా ఇది గుర్తింపు పొందింది. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొని కొత్త వాణిజ్య, పెట్టుబడి అవకాశాలను అన్వేషించారు. భారత్-అర్జెంటీనా మధ్య పెరుగుతున్న ఆర్థిక సంబంధాలు భవిష్యత్తులో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కీలక ఖనిజాలు, వ్యవసాయం, ఫార్మా, డిజిటల్ మరియు అంతరిక్ష రంగాల్లో సహకారం పెరగడం ద్వారా ఇరు దేశాలకు పరస్పర ప్రయోజనాలు చేకూరనున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాల విస్తరణలో మరో కీలక మైలురాయిగా నిలిచిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నేపాల్ వరదల్లో ప్రాణాలతో బయటపడి స్వదేశానికి చేరిన బాధితులు

- కొండలపైకి పరుగులు.. చెట్లెక్కి ప్రాణాలు కాపాడుకున్న వైనం
- రక్షణ చర్యలకు భారత్, నేపాల్ ప్రభుత్వాలకు కృతజ్ఞతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):





నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదల నుంచి ప్రాణాలతో బయటపడి స్వదేశానికి చేరుకున్న భారతీయులు తమ భయానక అనుభవాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురవుతున్నారు. క్షణాల్లో విరుచుకుపడిన జలప్రళయం తమ జీవితాల్లో ఎన్నటికీ మరిచిపోలేని విషాదాన్ని మిగిల్చిందని చెబుతున్నారు. బీహార్, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన కార్మికులు, యాత్రికులు, పర్యాటకులు సురక్షితంగా తిరిగి చేరుకున్నప్పటికీ, తమ కళ్ల ముందే జరిగిన విధ్వంసాన్ని తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. బీహార్ రాష్ట్రంలోని బెట్టియాకు చెందిన వలస కార్మికులు వరదలను "ఊహించలేని ప్రళయం"గా అభివర్ణించారు. ఒక్కసారిగా సుమారు 20 అడుగుల ఎత్తులో నీరు ఉప్పొంగి రావడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు పిల్లలను వెంటబెట్టుకుని కొండలపైకి పరుగులు తీయాల్సి వచ్చిందని తెలిపారు. తమతో కలిసి పనిచేస్తున్న ముగ్గురు సహచరులు వరదల్లో గల్లంతయ్యారని, నీరు తగ్గిన తర్వాత వెతికినా వారి జాడ దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి వరద ముప్పు ఉందన్న హెచ్చరికలతో అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాల్సి వచ్చిందని చెప్పారు.

మరో బాధితుడు ఉదయం భారీ శబ్దం విని బయటకు వచ్చేసరికి చుట్టుపక్కల ప్రాంతమంతా ధూళితో కమ్ముకుపోయిందని వివరించాడు. కొద్ది క్షణాల్లోనే వరద నీరు అన్ని వైపుల నుంచి ముంచెత్తడంతో ఎత్తైన ప్రాంతాలకు పరుగులు తీశామని చెప్పాడు. తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి ఇళ్లు, వాహనాలు, మనుషులు ఏవీ కనిపించలేదని, అంతా కొట్టుకుపోయిందని వేదన వ్యక్తం చేశాడు. ఆ దృశ్యాలు ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయని తెలిపాడు. కైలాస్ మానస సరోవర్ యాత్రకు వెళ్లిన చెన్నైకి చెందిన ఓ మహిళ కూడా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. ఆమె కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, చైనా-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో బస్సులో ప్రయాణిస్తుండగా వరదలు సంభవించాయి. పరిస్థితి అదుపు తప్పడంతో డ్రైవర్ బస్సును వదిలి పారిపోగా, ప్రయాణికులంతా ప్రాణాల కోసం పరుగులు తీశారు. ఆ మహిళ సమీపంలోని ఓ చెట్టు ఎక్కి మూడు నుంచి నాలుగు గంటల పాటు అక్కడే గడిపారని, అనంతరం నేపాల్ సైన్యం ఆమెను సురక్షితంగా రక్షించిందని తెలిపారు.




మహారాష్ట్రకు చెందిన పర్యాటకులు కూడా ఈ విపత్తు సమయంలో తీవ్ర ఆందోళనకు గురయ్యామని చెప్పారు. రోడ్లు కొట్టుకుపోవడం, వంతెనలు కూలిపోవడంతో ప్రయాణం పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. ప్రాణాలతో బయటపడతామో లేదోనన్న భయంతో గడిపామని, పిల్లల ధైర్యం తమకు బలాన్నిచ్చిందని పేర్కొన్నారు. పరిస్థితి తీవ్రతరం కావడంతో విమానంలో తిరిగి రావాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. రక్షణ చర్యల్లో నేపాల్ అధికారులు, సైన్యం, భారత రాయబార కార్యాలయం కీలక పాత్ర పోషించాయని బాధితులు తెలిపారు. సరైన పత్రాలు లేని పరిస్థితుల్లో కూడా నేపాల్ అధికారులు సహకరించారని, స్వదేశానికి సురక్షితంగా చేరుకునేందుకు ఏర్పాట్లు చేసిన భారత, నేపాల్ ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విపత్తు తమ జీవితాల్లో చెరగని ముద్ర వేసిందని, వరదల భయానకతను ఎప్పటికీ మరిచిపోలేమని బాధితులు పేర్కొన్నారు.



## బంగారం ధరలకు భారీ షాక్.. ఒక్కరోజే రూ.2,890 తగ్గుదల

హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):

బంగారం ధరలు శనివారం భారీగా తగ్గాయి. హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,240కి చేరింది. నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ.2,890 తగ్గింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,050గా నమోదైంది. ఇది కూడా రూ.2,650 తగ్గింది. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం రూ.1,58,240గా ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరలు దాదాపు ఇదే స్థాయిలో ఉన్నాయి. ఢిల్లీలో మాత్రం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,58,390గా, ముంబైలో రూ.1,58,240గా నమోదైంది. బంగారం ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గడంతో కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించింది.




## జియో ఐపీవోకు సెబీ ఆమోదం.. దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ!

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):

రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ ప్రతిపాదిత ఐపీవోకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఐపీవో ద్వారా సుమారు రూ.37,700 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా జియో ఐపీవో నిలవనుంది. డ్రాఫ్ట్ పత్రాల ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ 27 కోట్ల వరకు కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఇష్యూ అనంతరం కంపెనీ మొత్తం ఈక్విటీలో ఇవి సుమారు 2.9 శాతంగా ఉండనున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ సంస్థ విలువను సుమారు 137 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు.

ఐపీవో ద్వారా వచ్చే నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలతో పాటు జియో ప్లాట్‌ఫామ్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు సంబంధించిన బకాయిల చెల్లింపునకు వినియోగించనున్నారు. జూన్ చివరి నాటికి జియో ఇన్ఫోకామ్‌కు 53.3 కోట్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. జియో ఐపీవో పరిమాణం ప్రస్తుతం భారతదేశంలో అతిపెద్దదిగా ఉన్న హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీవో రికార్డును అధిగమించనుంది. హ్యుందాయ్ ఐపీవో 3.3 బిలియన్ డాలర్లుగా ఉండగా.. జియో ఇష్యూ సుమారు 3.8 బిలియన్ డాలర్లకు చేరనుంది.

## రూ.22 వేల కోట్ల అప్పు.. తిరిగి చెల్లించేది రూ.6.5 కోట్లు!

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):



ఒకప్పుడు దేశ మీడియా రంగాన్ని శాసించిన ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆయన తీసుకున్న దాదాపు రూ.22,006 కోట్ల అప్పులో కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేలా రుణ పరిష్కార ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది.

రుణదాతలు క్లెయిమ్ చేసిన రూ.22,006.57 కోట్లకు బదులుగా కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉండటంతో వారికి భారీ నష్టం వాటిల్లనుంది. ఈ నేపథ్యంలో సుభాష్ చంద్ర వీడియో సందేశం విడుదల చేశారు. తన వద్ద చిన్న ఇల్లు ఉందని, దానిని అద్దెకిచ్చి వచ్చే ఆదాయంతో ఖర్చులు వెళ్లదీస్తున్నానని తెలిపారు. “నాకు పశ్చాత్తాపం లేదు. నేను మళ్లీ సంపాదిస్తాను. కొత్త విషయాలను ఎలా ప్రారంభించాలో నాకు తెలుసు” అని ధీమా వ్యక్తం చేశారు.

ఎస్సెల్ గ్రూప్ ద్వారా మీడియా నుంచి మౌలిక సదుపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కుల వరకు ఆయన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో పనిచేస్తున్న తన స్నేహితులతో కలిసి కొత్తగా పని చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను త్వరలో వెల్లడిస్తానన్నారు.

అలాగే కొన్ని స్టార్టప్‌లను ముందుకు నడిపించేందుకు కుటుంబ సభ్యుల నుంచి రూ.24 కోట్ల వరకు అప్పు తీసుకునే అవకాశం ఉందని సుభాష్ చంద్ర తెలిపారు. ఆర్థిక సంక్షోభం ఎదురైనా కొత్త వ్యాపార ప్రయాణాన్ని కొనసాగిస్తానని 75 ఏళ్ల సుభాష్ చంద్ర ప్రకటించడం గమనార్హం.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 30 - ఆగస్టు 2026


# వైద్య విద్యార్థిని బలవన్మరణం

- **హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో విషాద ఘటన**
- **కర్నూలు వ్యాపారి ఏకైక కుమార్తె మృతి**
- **కారణాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



**హైదరాబాద్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ యువ వైద్య విద్యార్థిని హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలోని తన నివాస గదిలో శనివారం బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థినిని కర్నూలుకు చెందిన ప్రముఖ వ్యాపారి రామ్మోహన్ రెడ్డి కుమార్తె యశ్వితగా పోలీసులు గుర్తించారు. వైద్య రంగంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్న యువతి ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులను, సహ విద్యార్థులను, వైద్య వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసుల వివరాల ప్రకారం, యశ్విత గత ఆరు నెలలుగా హైదరాబాద్‌లో ఉంటూ నీట్ పీజీ ప్రవేశ పరీక్ష కోసం ప్రత్యేక కోచింగ్ తీసుకుంటోంది. శనివారం ఆమె బస చేస్తున్న గదిలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై స్పష్టత రావాల్సి ఉందని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, కోచింగ్ సెంటర్ నిర్వాహకుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి కారణాన్ని నిర్ధారించలేమని, దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. యశ్విత కర్నూలుకు చెందిన వ్యాపారవేత్త రామ్మోహన్ రెడ్డి ఏకైక కుమార్తె కావడం ఈ విషాదాన్ని మరింత హృదయ విదారకంగా మార్చింది. ఉన్నత విద్య కోసం కృషి చేస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర శోక సంద్రంలో మునిగిపోయారు. విషయం తెలిసిన వెంటనే బంధువులు, సన్నిహితులు హైదరాబాద్‌కు చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు.పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, ఆందోళనలపై మరోసారి చర్చ మొదలైంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, శిక్షణ కేంద్రాలు మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు కౌన్సెలింగ్, మానసిక సహాయం అందుబాటులో ఉండాలని సూచిస్తున్నారు. యశ్విత మృతి వైద్య విద్యార్థుల వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆమె మరణానికి గల అసలు కారణాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# మానవ హక్కుల పరిరక్షణలో ప్రపంచ దేశాల బాధ్యత



**డెస్క్, 29 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచంలోని ప్రతి మనిషి గౌరవంగా, స్వేచ్ఛగా, భద్రంగా జీవించే హక్కును కలిగి ఉంటాడు. ఈ హక్కులు ఏ దేశం, మతం, జాతి, భాష, లింగం లేదా సామాజిక స్థితితో సంబంధం లేకుండా అందరికీ సమానంగా వర్తిస్తాయి. జీవించే హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛ, విద్య హక్కు, ఆరోగ్య హక్కు, సమానత్వ హక్కు వంటి మౌలిక హక్కులు మానవ నాగరికతకు పునాదిగా నిలిచాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ఈ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయి. యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, రాజకీయ అణచివేతలు, వివక్ష, పేదరికం వంటి కారణాలతో కోట్లాది మంది ప్రజలు తమ ప్రాథమిక హక్కులను పూర్తిగా అనుభవించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో మానవ హక్కుల పరిరక్షణ అనేది కేవలం ఒక దేశం బాధ్యత మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచ సమాజం కలిసి నిర్వర్తించాల్సిన బాధ్యతగా మారింది.

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం మానవ హక్కుల ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రపంచ దేశాలు మానవ గౌరవాన్ని కాపాడేందుకు అనేక అంతర్జాతీయ ఒప్పందాలను రూపొందించాయి. ప్రపంచ శాంతి, భద్రత, సమానత్వం కోసం మానవ హక్కులు అత్యంత కీలకమని ఐక్యరాజ్యసమితి స్పష్టం చేసింది. అయినప్పటికీ నేటికీ అనేక ప్రాంతాల్లో నిర్బంధాలు, హింస, బలవంతపు అదృశ్యాలు, జాతి వివక్ష, మతపరమైన దాడులు, మహిళలు మరియు చిన్నారులపై దురాగతాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆధునిక ప్రపంచం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మానవ హక్కుల పరిరక్షణలో ఇంకా అనేక లోపాలు కనిపిస్తుండటం ఆందోళన కలిగించే విషయం. అందుకే ప్రపంచ దేశాలు తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కంటే మానవ విలువలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

మానవ హక్కుల పరిరక్షణలో ప్రతి దేశ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుంది. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడటం, చట్టాలను సమర్థంగా అమలు చేయడం, న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రజల భద్రతను నిర్ధారించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. ప్రజల అభిప్రాయాలను గౌరవించడం, భావ ప్రకటనా స్వేచ్ఛకు అవకాశం కల్పించడం, విభిన్న అభిప్రాయాలను అణచివేయకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడటం కూడా అదే స్థాయిలో అవసరం. ఒక దేశంలో మానవ హక్కులు బలంగా ఉంటే అక్కడ సామాజిక స్థిరత్వం, ఆర్థికాభివృద్ధి, ప్రజల విశ్వాసం కూడా పెరుగుతాయి. కాబట్టి మానవ హక్కులను పరిరక్షించడం దేశాభివృద్ధికి కూడా పునాదిగా భావించాలి.

ప్రపంచీకరణ యుగంలో మానవ హక్కుల సమస్యలు ఒక దేశానికి మాత్రమే పరిమితం కావు. ఒక ప్రాంతంలో జరిగే హక్కుల ఉల్లంఘనలు ప్రపంచవ్యాప్తంగా చర్చకు వస్తున్నాయి. శరణార్థుల సమస్య, యుద్ధ బాధితుల పరిస్థితి, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా వంటి సమస్యలు అంతర్జాతీయ సహకారం లేకుండా పరిష్కారం కావు. అందుకే ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో పని చేయాలి. అంతర్జాతీయ సంస్థలు, మానవ హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను అన్వేషించాలి. మానవ హక్కుల ఉల్లంఘనలపై మౌనం పాటించడం కూడా పరోక్షంగా వాటిని ప్రోత్సహించినట్లే అవుతుందని ప్రపంచ నాయకులు గుర్తించాలి.

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో కొత్త రకాల సవాళ్లు కూడా మానవ హక్కుల ముందుకు వస్తున్నాయి. వ్యక్తిగత గోప్యత, డిజిటల్ భద్రత, సమాచార స్వేచ్ఛ వంటి అంశాలు ఇప్పుడు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సాంకేతికతను ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాల్సిందే కానీ వారి హక్కులను హరించే సాధనంగా మార్చకూడదు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ పర్యవేక్షణ, సమాచార సేకరణ వంటి రంగాల్లో కూడా మానవ హక్కుల ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తు తరాలకు స్వేచ్ఛాయుతమైన, సురక్షితమైన ప్రపంచాన్ని అందించాలంటే ఈ అంశాలపై ఇప్పటి నుంచే స్పష్టమైన విధానాలు రూపొందించాలి. మానవ హక్కుల పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాలు లేదా అంతర్జాతీయ సంస్థల బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడు కూడా తన హక్కులతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాల్సిన బాధ్యత కలిగి ఉంటాడు. సమానత్వం, సహనం, సానుభూతి, పరస్పర గౌరవం వంటి విలువలు సమాజంలో బలపడినప్పుడే మానవ హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది. ప్రపంచ దేశాలు తమ విధానాల్లో మానవ గౌరవానికి అత్యున్నత స్థానం కల్పించి, హక్కుల ఉల్లంఘనలను కఠినంగా అరికట్టినప్పుడే శాంతియుతమైన, న్యాయబద్ధమైన ప్రపంచ నిర్మాణం సాధ్యమవుతుంది. అందుకే మానవ హక్కుల పరిరక్షణను ఒక చట్టపరమైన బాధ్యతగా మాత్రమే కాకుండా మానవత్వాన్ని కాపాడే మహత్తర కర్తవ్యంగా ప్రతి దేశం భావించాల్సిన సమయం ఆసన్నమైంది.

# ఆత్మీయులను కోల్పోయిన వారి బాధకు అండగా నిలుద్దాం

- **విషాదాన్ని అర్థం చేసుకోవడం కూడా అవసరమే**
- **మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచే ప్రత్యేక దినం**
- **సానుభూతి, సహకారమే బాధితులకు పెద్ద బలం**

**డెస్క్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):** జీవితంలో ప్రతి మనిషి ఏదో ఒక దశలో ఆత్మీయులను, కుటుంబ సభ్యులను, స్నేహితులను లేదా తనకు అత్యంత విలువైన వ్యక్తులను కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటాడు. అలాంటి సందర్భాల్లో కలిగే తీవ్ర మానసిక వేదన, బాధ, ఒంటరితనం, నిరాశ వంటి భావోద్వేగాలను గుర్తించి వాటిపై అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 30న నేషనల్ గ్రీఫ్ అవేర్‌నెస్ డేను నిర్వహిస్తారు. ఈ దినం ప్రధాన ఉద్దేశం విషాదాన్ని ఎదుర్కొంటున్న వ్యక్తులను అర్థం చేసుకోవడం, వారికి మానసికంగా అండగా నిలవడం, సమాజంలో సానుభూతి భావనను పెంపొందించడం. బాధను దాచిపెట్టకుండా వ్యక్తపరచడం కూడా మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమని ఈ రోజు గుర్తుచేస్తుంది.

ఆత్మీయులను కోల్పోవడం అనేది జీవితంలో అత్యంత కఠినమైన అనుభవాల్లో ఒకటిగా పరిగణించబడుతుంది. కుటుంబ సభ్యుడు, జీవిత భాగస్వామి, స్నేహితుడు లేదా అత్యంత సన్నిహిత వ్యక్తి మరణించినప్పుడు కలిగే బాధ ఒక్క రోజులో లేదా కొద్ది రోజుల్లో తొలగిపోదు. కొందరు ఆ బాధ నుంచి త్వరగా బయటపడగలిగినా, మరికొందరు నెలలు లేదా సంవత్సరాల పాటు మానసికంగా తీవ్ర వేదనను అనుభవిస్తారు. ఈ పరిస్థితిలో భావోద్వేగాల మార్పులు సహజమని, ప్రతి వ్యక్తి తనదైన విధంగా విషాదాన్ని ఎదుర్కొంటాడని మానసిక నిపుణులు చెబుతున్నారు. విషాదం కేవలం భావోద్వేగాలకు మాత్రమే పరిమితం కాదు. అది వ్యక్తి ఆరోగ్యం, ఆలోచనా విధానం, సామాజిక సంబంధాలు, ఉద్యోగ జీవితం వంటి అనేక అంశాలపై ప్రభావం చూపుతుంది. బాధ, కోపం, నిరాశ, ఆందోళన, నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు కనిపించవచ్చు. కొందరిలో జీవితం పట్ల ఆసక్తి తగ్గిపోవడం, ఇతరులతో కలవడానికి ఇష్టపడకపోవడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ పరిస్థితులను అర్థం చేసుకుని వారికి అవసరమైన సహాయం అందించడం కుటుంబ సభ్యులు, స్నేహితుల బాధ్యతగా నిపుణులు సూచిస్తున్నారు.

సమాజంలో ఇప్పటికీ మానసిక వేదన గురించి బహిరంగంగా మాట్లాడటానికి చాలామంది సంకోచిస్తుంటారు. బాధలో ఉన్న వ్యక్తి త్వరగా సాధారణ స్థితికి రావాలని ఒత్తిడి చేయడం కంటే, అతని భావాలను వినడం, అర్థం చేసుకోవడం, అవసరమైన సమయంలో తోడుగా ఉండడం ఎంతో ముఖ్యం. ఒక వ్యక్తి తన బాధను వ్యక్తపరచుకునే అవకాశం కల్పించడం ద్వారా అతనిలో ఉన్న ఒత్తిడి కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే సానుభూతితో వినడం కూడా ఒక విధమైన మద్దతుగా పరిగణించబడుతోంది. నేషనల్ గ్రీఫ్ అవేర్‌నెస్ డే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మానసిక ఆరోగ్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు కలిసి విషాదాన్ని ఎదుర్కొంటున్న వ్యక్తులకు మద్దతు అందించే మార్గాలపై చర్చలు నిర్వహిస్తారు. బాధిత కుటుంబాలకు కౌన్సెలింగ్ సేవల ప్రాముఖ్యత, మానసిక ఆరోగ్య సంరక్షణ అవసరం, సామాజిక మద్దతు వ్యవస్థల పాత్ర వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాలు విషాదాన్ని వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక అంశంగా చూడాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తాయి.

పిల్లలు కూడా ఆత్మీయులను కోల్పోయినప్పుడు తీవ్ర ప్రభావానికి గురవుతారు. అయితే వారు తమ భావాలను పెద్దల మాదిరిగా వ్యక్తపరచలేకపోవచ్చు. అందువల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. వారికి భరోసా కల్పించడం, వారి సందేహాలకు సమాధానం ఇవ్వడం, భావోద్వేగాలను వ్యక్తపరచేందుకు ప్రోత్సహించడం అవసరం. చిన్న వయస్సులోనే మానసిక ఆరోగ్యంపై సరైన అవగాహన కల్పించడం భవిష్యత్తులో మంచి ఫలితాలను ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. వృద్ధులు కూడా విషాదాన్ని తీవ్రంగా అనుభవించే వర్గాల్లో ఒకరు. జీవిత భాగస్వామిని లేదా కుటుంబ సభ్యులను కోల్పోయిన తర్వాత చాలామంది ఒంటరితనానికి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు వారితో ఎక్కువ సమయం గడపడం, వారి భావాలను గౌరవించడం, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించడం అవసరం. వృద్ధుల మానసిక ఆరోగ్యం పట్ల కూడా సమాజం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఆధునిక కాలంలో మానసిక ఆరోగ్య సేవల ప్రాధాన్యం మరింత పెరిగింది. కౌన్సెలింగ్, మానసిక చికిత్స, మద్దతు సమూహాలు వంటి సేవలు విషాదాన్ని ఎదుర్కొంటున్న వ్యక్తులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అవసరమైనప్పుడు నిపుణుల సహాయం తీసుకోవడం బలహీనత కాదని, అది ఆరోగ్యకరమైన నిర్ణయమని వైద్య నిపుణులు చెబుతున్నారు. సమయానికి సరైన సహాయం అందితే వ్యక్తులు తమ జీవితాన్ని మళ్లీ సాధారణ స్థితికి తీసుకురాగలరని వారు పేర్కొంటున్నారు. విషాదం అనేది ప్రతి మనిషి జీవితంలో ఒక భాగం. అయితే దానిని ఒంటరిగా ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. కుటుంబం, స్నేహితులు, సమాజం అందించే మద్దతు బాధను తట్టుకునే శక్తిని పెంచుతుంది. ఒక చిన్న పరామర్శ, ఓదార్పు మాట, సహానుభూతితో కూడిన ప్రవర్తన కూడా బాధలో ఉన్న వ్యక్తికి ఎంతో ధైర్యాన్ని అందించగలదు. అందుకే మానవ సంబంధాల విలువను ఈ దినోత్సవం ప్రత్యేకంగా గుర్తు చేస్తుంది. నేషనల్ గ్రీఫ్ అవేర్‌నెస్ డే విషాదాన్ని అర్థం చేసుకోవడం, మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించడం, బాధితులకు అండగా నిలవడం వంటి విలువలను సమాజానికి గుర్తు చేసే ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది. ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను గౌరవించడం, వారికి అవసరమైన మద్దతు అందించడం, మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించడం ద్వారా మరింత సానుభూతి గల సమాజాన్ని నిర్మించవచ్చని ఈ దినోత్సవం స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది.

# సముద్ర తీరాల సంరక్షణ మనందరి బాధ్యత

**డెస్క్, ఆగస్టు 29 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రకృతి అందాలకు ప్రతీకలుగా నిలిచే సముద్ర తీరాల ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తూ, వాటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 30న జాతీయ బీచ్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సముద్ర తీరాలు కేవలం పర్యాటక ప్రాంతాలే కాదు, పర్యావరణ సమతుల్యతకు, జీవ వైవిధ్యానికి, తీర ప్రాంత ప్రజల జీవనాధారానికి కీలక కేంద్రాలుగా ఉంటాయి. అయితే పెరుగుతున్న కాలుష్యం, నిర్లక్ష్యం, వాతావరణ మార్పుల ప్రభావంతో అనేక బీచ్‌లు తమ సహజ సౌందర్యాన్ని కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో సముద్ర తీరాల పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో బాధ్యత పెంపొందించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు విశ్రాంతి, వినోదం, పర్యాటక అవసరాల కోసం బీచ్‌లను సందర్శిస్తుంటారు. సముద్ర అలలు, ఇసుక తీరాలు, ప్రకృతి సోయగాలు ప్రజలకు మానసిక ప్రశాంతతను అందిస్తాయి. అనేక ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కూడా బీచ్‌లు ప్రధాన ఆధారంగా నిలుస్తాయి. పర్యాటక రంగం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, చేపల వేట వంటి అనేక రంగాలు సముద్ర తీరాలతో ముడిపడి ఉన్నాయి. అందువల్ల బీచ్‌ల సంరక్షణ అంటే పర్యావరణంతో పాటు ఆర్థిక వ్యవస్థను కూడా కాపాడినట్లేనని నిపుణులు పేర్కొంటున్నారు.

సముద్ర తీరాలు అనేక జీవరాశులకు నివాస ప్రాంతాలుగా ఉంటాయి. తాబేళ్లు, పీతలు, సముద్ర పక్షులు, వివిధ రకాల సూక్ష్మ జీవులు బీచ్‌లపై ఆధారపడి జీవిస్తాయి. సముద్రం మరియు భూమి మధ్య సహజ వారధిగా బీచ్‌లు పనిచేస్తాయి. తుఫాన్లు, అలల ప్రభావం, తీర ప్రాంత క్షీణతను నియంత్రించడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఇసుక తీరాలు సహజ రక్షణ కవచాలుగా వ్యవహరిస్తూ తీర ప్రాంత గ్రామాలు, పట్టణాలను సముద్ర ఉద్ధృతుల నుంచి కాపాడుతాయి. అందుకే సముద్ర తీరాల పరిరక్షణను పర్యావరణవేత్తలు అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో బీచ్‌లు తీవ్రమైన కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్నాయి. ప్లాస్టిక్ సీసాలు, ఆహార ప్యాకెట్లు, వాడేసి పారేసే వస్తువులు, పారిశ్రామిక వ్యర్థాలు సముద్ర తీరాలను కలుషితం చేస్తున్నాయి. పర్యాటకులు నిర్లక్ష్యంగా చెత్తను వదిలివేయడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. ఈ వ్యర్థాలు సముద్రంలోకి చేరి చేపలు, తాబేళ్లు, ఇతర జలచరాలకు ప్రమాదంగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భావించి మింగడం వల్ల సముద్ర జీవులు మరణిస్తున్నాయి. ఈ పరిస్థితి పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారింది.

వాతావరణ మార్పులు కూడా సముద్ర తీరాలపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. సముద్ర మట్టం పెరగడం, తుఫాన్ల తీవ్రత అధికం కావడం, తీర ప్రాంతాల కోత వంటి సమస్యలు అనేక దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇసుక తీరాలు క్రమంగా క్షీణిస్తూ భూభాగాన్ని కోల్పోతున్నాయి. దీని ప్రభావం తీర ప్రాంత ప్రజల జీవన విధానంపై పడుతోంది. భవిష్యత్తులో ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భారతదేశానికి వేల కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం ఉంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో అనేక ప్రసిద్ధ బీచ్‌లు ఉన్నాయి. విశాఖపట్నంలోని రామకృష్ణ బీచ్, భీమునిపట్నం తీర ప్రాంతం, కాకినాడ సముద్ర తీరం వంటి ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ తీర ప్రాంతాల పరిశుభ్రత, భద్రత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి. స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.

సముద్ర తీరాల పరిశుభ్రత కోసం ప్రపంచవ్యాప్తంగా అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, యువత, పర్యావరణ కార్యకర్తలు కలిసి బీచ్ శుభ్రత కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సముద్ర తీరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పర్యావరణ బాధ్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. బీచ్‌లను సందర్శించే ప్రతి వ్యక్తి కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటించడం ద్వారా వాటి సంరక్షణకు తోడ్పడవచ్చు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టల్లో వేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, సముద్ర జీవులకు హాని కలిగించే చర్యలకు దూరంగా ఉండడం అవసరం. ప్రకృతి సంపదను ఆస్వాదించడమే కాకుండా దానిని భవిష్యత్ తరాలకు అందించడం కూడా మన బాధ్యత అని గుర్తుంచుకోవాలి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రవితేజ సరసన ఐశ్వర్య రాజేష్..

మాస్ మహారాజా రవితేజ చాలా కాలం తర్వాత సాలిడ్ హిట్ అందుకోవడంతో ఆయన తదుపరి సినిమాపై ఆసక్తి నెలకొంది. వరుస పరాజయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న రవితేజ.. 'ఇరుముడి'తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నట్లు సమాచారం. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ థ్రిల్లర్ డ్రామాలో రవితేజ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రం థియేటర్లలో మంచి వసూళ్లతో దూసుకెళ్తోంది. ఇప్పటికే రూ.135 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది.

ఈ సినిమా విజయంతో రవితేజ తదుపరి చిత్రంపై అంచనాలు పెరిగాయి. యువ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ సినిమాకు ఓకే చెప్పినట్లు సమాచారం. ఈ చిత్రానికి 'దాగుడు మూతల దండాకోర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమాలో రవితేజకు జోడీగా ఎవరు నటిస్తారన్న దానిపై కూడా ఆసక్తికర చర్చ జరుగుతోంది. నటి ఐశ్వర్య రాజేష్ కథానాయికగా నటించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తెలుగు, తమిళ భాషల్లో వరుస చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య.. పాత్రకు ప్రాధాన్యత ఉన్న కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది.

ఇటీవల 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఐశ్వర్య రాజేష్‌కు ఈ చిత్రం మరో మంచి అవకాశంగా మారనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే రవితేజ, ఐశ్వర్య రాజేష్ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ జోడీ తెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

# గర్భధారణ అనుభవాలను పంచుకున్న సమంత



ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు తన గర్భధారణ అనుభవాలను అభిమానులతో పంచుకున్నారు. సామాజిక మాధ్యమ వేదికగా నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో కాబోయే తల్లులతో ముచ్చటించిన ఆమె.. గర్భధారణ సమయంలో ఎదుర్కొంటున్న అనుభవాలు, బిడ్డ కోసం చేస్తున్న ఏర్పాట్లు, బరువు పెరగడం, బిడ్డకు పేరు పెట్టడం వంటి విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

బిడ్డ కోసం అవసరమైన వస్తువులన్నీ ఇప్పటికే కొనుగోలు చేశానని సమంత తెలిపారు. అయితే వాటిని చూస్తుంటే ఇప్పుడు కొంత భయంగా అనిపిస్తోందని సరదాగా వ్యాఖ్యానించారు. గర్భధారణ సమయంలో బరువు పెరగడంపై ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. తాను ఇప్పటికే 11 కిలోల బరువు పెరిగినట్లు వెల్లడించారు.

ఇటీవల తల్లిగా మారిన ఓ యువతి తన దినచర్యను వివరిస్తూ.. బిడ్డకు పాలు పట్టించడం, త్రేన్పు తెప్పించడం, జోలపాడటం వంటివే రోజంతా జరుగుతున్నాయని చెప్పగా.. అది వింటుంటేనే పూర్తి సమయం చేసే ఉద్యోగంలా అనిపిస్తోందని సమంత సరదాగా స్పందించారు.

బిడ్డకు ఏ పేరు పెట్టాలనుకుంటున్నారని ఓ అభిమాని ప్రశ్నించగా.. తాను ఊహించిన దానికంటే పేరు ఎంపిక చేయడం చాలా కష్టంగా ఉందని సమంత తెలిపారు. దీనికి అభిమానుల సహాయం అవసరం కావచ్చని అన్నారు.

తన గర్భధారణ ప్రయాణాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నానని సమంత స్పష్టం చేశారు. మాతృత్వం ఎంతో అందమైన, అద్భుతమైన, జీవితాన్ని మార్చే అనుభవమని పేర్కొన్నారు. మాతృత్వానికి ప్రత్యేకమైన మార్గదర్శకం ఉంటే బాగుండేదని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ ప్రయాణం తనను ఎంతో శక్తిమంతంగా మార్చిందని కూడా ఆమె తెలిపారు.

# శింబుతో సినిమాకు వెళ్లాలనుంది..

## మీనాక్షి చౌదరి ఆసక్తికర వ్యాఖ్యలు



టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న పంజాబీ ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి ప్రస్తుతం అత్యంత డిమాండ్ ఉన్న కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 'హిట్ 2', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', 'అనగనగా ఒక రాజు' వంటి చిత్రాలతో విజయాలు అందుకున్న ఆమె.. 'లక్కీ ఛామ్'గా పేరు సంపాదించారు. టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్‌లోనూ విజయ్ దళపతి సరసన నటించి అక్కడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

తాజాగా గతంలో మీనాక్షి చౌదరి ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో మరోసారి వైరల్‌గా మారాయి. ఒకవేళ సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా కలిసి సినిమాకు వెళ్లే అవకాశం వస్తే ఎవరిని ఎంచుకుంటారని యాంకర్ ప్రశ్నించగా.. మీనాక్షి ఏమాత్రం ఆలోచించకుండా కోలీవుడ్ స్టార్ హీరో శింబు పేరును చెప్పినట్లు తెలుస్తోంది.

### శింబు అంటే చాలా ఇష్టం

శింబుతో కలిసి సినిమాకు వెళ్లాలనుకుంటున్నానని మీనాక్షి చౌదరి చెప్పడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. శింబు నటన, తెరపై ఆయన కనిపించే తీరు తనకు ఎంతో ఇష్టమని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. దీంతో మీనాక్షి చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి.

### గతంలోనూ ప్రేమ వార్తలు

గతంలో శింబు, మీనాక్షి చౌదరి ప్రేమలో ఉన్నారంటూ పలు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ వార్తలపై ఇద్దరూ అధికారికంగా స్పందించలేదు. ఇప్పుడు మీనాక్షి శింబుతో కలిసి సినిమాకు వెళ్లాలనుకుంటున్నానని చెప్పడంతో అభిమానుల్లో మరోసారి ఆసక్తి మొదలైంది.

### ఇద్దరి కాంబినేషన్‌పై అభిమానుల ఆసక్తి

మీనాక్షి వ్యాఖ్యలపై శింబు అభిమానులు సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ కలిసి ఓ సినిమాలో నటిస్తే చూడాలని అభిమానులు సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. శింబు నటిస్తున్న భారీ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే అవకాశం ఉందంటూ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# ప్రేమకథ చిత్రంతో గుర్తింపు.. ఆ తర్వాత కనుమరుగు!

సుధీర్‌బాబు హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ప్రేమకథ చిత్రం' సినిమా అప్పట్లో ఘన విజయం సాధించింది. 2013లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ హారర్ కామెడీ చిత్రంలో నందితా రాజ్ కథానాయికగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సప్తగిరి, ప్రవీణ్ కామెడీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవగా.. నందితా రాజ్ తన నటనతో పాటు అందంతోనూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

'ప్రేమకథ చిత్రం' విజయంతో నందితా రాజ్‌కు వరుస అవకాశాలు వస్తాయని, ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదుగుతారని అప్పట్లో సినీ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే అనూహ్యంగా ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు.

తేజ దర్శకత్వంలో తెరకెక్కిన 'నీకు నాకు డాష్ డాష్' సినిమాతో కథానాయికగా పరిచయమైన నందితా రాజ్.. 'ప్రేమకథ చిత్రం'తో ఒక్కసారిగా ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అనంతరం సుధీర్‌బాబుతో కలిసి 'కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ' సినిమాలో నటించారు. అయితే ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'జై లవకుశ' చిత్రంలో చిన్న పాత్రలో కనిపించారు.

### సినిమాలకు దూరంగా..

2019లో 'విశ్వమిత్ర' సినిమాలో నటించిన తర్వాత నందితా రాజ్ సినిమాలకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం ఆమె సినీ రంగంలో పెద్దగా కనిపించడం లేదు. సామాజిక మాధ్యమాల్లోనూ ఆమె అంతగా చురుకుగా ఉండకపోవడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం నందితా రాజ్ ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు? అంటూ నెటిజన్లు ఆసక్తిగా వెతుకుతున్నారు.

ఇటీవల ఆమెకు సంబంధించిన తాజా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో మరోసారి నందితా రాజ్ పేరు చర్చలోకి వచ్చింది. 'ప్రేమకథ చిత్రం'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ కథానాయిక.. ఆ తర్వాత సినిమాలకు దూరం కావడం సినీ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in